క్లుప్తంగా

సబ్ కలెక్టర్‌కు సన్మానం

మిర్యాలగూడ: మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా అమిత్‌నారాయణ్‌ను శుక్రవారం మిర్యాలగూడ సమాచార హక్కు వికాస సమితి కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ మట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషిచేస్తానని అన్నారు. ఏమైనా సమస్య ఏర్పడితే నేరుగా తనను సంప్రదించాలన్నారు. అదేవిధంగా సమాచార హక్కు వికాస సమితి సభ్యులు పౌరులకు పౌర సేవల గురించి అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. అనంతరం వికాస సమితి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేశ్వరం సతీష్‌కుమార్, ఎండి.కలీం, షేక్ సల్మాన్, పిన్నం యాదగిరి, చీదళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని ప్రజలకు శనివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు గుడిపాటి కోటయ్య శుక్రవారం తెలిపారు. కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ పాల్గొని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావునా పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



వినాయకుడి మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న సభ్యులు

దేవరకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ అన్నారు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం బస్టాండ్ వద్ద క్లబ్ ఆధ్వర్యంలో 200ల వినాయకుడి మట్టి ప్రతిమలను పంపిణీ చేసి మాట్లాడారు.మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఆయన కోరారు.ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల నడుమ వినాయక చవితిని జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సముద్రాల ప్రభాకర్,వనం భిక్షమయ్య,జగిని కృష్ణయ్య. బుచ్చయ్య.ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్ : భర్త వేధింపులు తట్టుకోలేక మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం దుగ్గెపల్లి గ్రామానికి చెందిన కలిమెల రమేష్‌తో అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన స్వప్న(30)కు వివాహం జరిగింది. వీరి కాపురం కొంత కాలం సాఫీగా సాగింది. కూలి పనులకు వెళ్తు మద్యానికి బానిసైన కలిమెల రమేష్ తరచు తన భార్య స్వప్నను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో వేధింపులు తట్టుకోలేక ఇంట్లో ఎవరులేని సమయంలో స్వప్న(30) ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బయటికి వెళ్లిన పిల్లలు వచ్చి చూసే సరికి తల్లి ఆత్మహత్య చేసుకుని ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓటరు జాబితాపై సర్వే

డిండి: గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో సంబంధిత అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సదర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని మున్సిపల్ చైర్మన్ తిరునగర భార్గవ్, టూ టౌన్ సీఐ నాగార్జున అన్నారు. శుక్రవారం పట్టణంలోని మట్టి విగ్రహాలను వారు పంపిణీ చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వినాయక ఉత్సవాలను 9 రోజుల పాటు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ నియామకం

మిర్యాలగూడ టౌన్ : బ్యాడ్మింటన్ నల్లగొండ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పట్టణానికి చెందిన డాక్టర్ టి.ప్రశాంత్, పి.నవీన్‌కుమార్‌ను నియమిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నియమక పత్రాన్ని స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆ అసోసియేషన్ ప్రతినిధి యుపీఎస్.బాబు వారికి అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయి పోటీలను నల్లగొండ జిల్లాలో జరిగే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తోట రంగారావు, కోచ్ రామకృష్ణ, నేతి రాహుల్ ఉన్నారు.

నిబంధనలు పాటిద్దాం

- డిజే సౌండ్స్ నిషేధించిన పోలీసులు
- మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



మండల కేంద్రంలో ముస్తాబైన గణేశ్ మండపం

పెద్దఅడిశర్లపల్లి : గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించి శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని పోలీసులు కోరుతున్నారు. మట్టి విగ్రహాలను వాడి పర్యావరణ పరిక్షణలో పాలుపంచుకోవాలని తమవంతు ప్రచారం కల్పిస్తున్నారు. ఇప్పటికే శాంతిసంఘం సమావేశం నిర్వహించి ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలకు అవగాహన కల్పించిన పోలీసులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని పేర్కొంటున్నారు. పీఏపల్లి మండలంలో ఏకేబీఆర్, పుట్టంగండి సిస్టర్న్, లింక్ కెనాల్‌లలో గణేశ్ నిమజ్జనం నిషేదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గణేశ్ ఉత్సవ కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

అధికారుల నిబంధనలు ఇలా..

- గణేశ్ ఉత్సవ కమిటీలు గణేశ్ మండప ఏర్పాటుకు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని దరఖాస్తు ఫారంను పోలీసులకు అందించి అనుమతులు పొందాలి.
- గణేశ్ ఉత్సవ కమిటీ వాలంటీర్లు విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ చౌర్యానికి పాల్పడరాదు.
- డి.జే. సౌండ్ సిస్టమ్ నిషేధించడింది.
- నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు తప్పక పాటించాలి.
- రాత్రి 10 గంటల తర్వాత ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయరాదు.
- అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- రాత్రి సమయంలో గణేష్ మండపాల వద్ద ఇద్దరు కమిటి సభ్యులు కాపాల ఉండాలి.
- స్వచ్ఛందంగా పోలీసు వాలంటీరుగ్లా ఉండాలనుకునే వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.
- పోలీసులు సూచించిన చోటనే నిమజ్జనం చేయాలి.

పోలీసుల సూచనలు పాటించాలి



గణేశ్ ఉత్సవ కమిటీ వాలంటీర్లు పోలీసుల సూచనలు పాటించి ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేందుకు సహకరించాలి. ఇప్పటికే ఉత్సవ కమిటీలకు తగు సూచనలు ఇచ్చాం. తొమ్మిది రోజుల పాటు సాగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఛోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీలు తగు ఏర్పాట్లు చేసుకోవాలి.స్వచ్ఛందంగా పోలీసు వాలంటీరుగ్లా ఉండాలనుకునే వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.

నర్సింహులు, ఎస్ఐ, గుడిపల్లి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: క్రీడలపై శిక్షణ పొంది, నిరంతరం సాధన చేస్తే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-11 బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులకు పైగా హాజరుకావడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బాలికల డబుల్స్ విభాగంలో మెదక్ జిల్లాకు చెందిన కోరుకొండ లోక్ష, నిమ్మ సాన్వి విజేతలుగా నిలిచారు. అదే విధంగా బాలుర డబుల్స్ విభాగంలో మెదక్ జిల్లాకు చెందిన ముసుకుల రిత్విక్‌రెడ్డి, రాపోలు హర్షత్ విజయ్‌లు విజేతలుగా నిలిచారు. బాలుర సింగిల్స్ విభాగంలో మెదక్ జిల్లాకు చెందిన ముసుకుల రిత్విక్‌రెడ్డి, బాలికల సింగిల్స్‌లో మెదక్ జిల్లాకు చెందిన నిమ్మ సాన్వీ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అంజయ్య, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు, పి. నవీన్‌కుమార్, బ్యాడ్మింటన్ సభ్యులు యూపీఎన్ బాబు, జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ, నేతి రాహుల్, సాంకృత్యాన్‌లతో పాటు పలు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు



రూరల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ టౌన్ : కొత్తగా ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కేసుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసే వినాయక నవరాత్రి ఉత్సవాలకు పోలీస్ స్టేషన్, విద్యుత్ శాఖ నుంచి తప్పని సరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకుత గంజాయిపై ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గంజాయిని తాగినట్లు గుర్తించేందుకు డీఎస్పీ కార్యాలయంలో 70 వరకు టెస్టింగ్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ కె. నరేష్ ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం ఆయన ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులతో కలిసి రోడ్డు ప్రమాదాలు జరిగే పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారితోపాటు వైజంక్షన్, నందిపాడు, చిల్లాపురం, చింతపల్లి క్రాస్‌రోడ్డును పరిశీలించి అధికారులకు సూచలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



వాడపల్లి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మిర్యాలగూడ: గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ శుక్రవారం దామరచర్ల మండలంలోని వాడపల్లిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు నిబంధనలను పాటించాలన్నారు. అగ్నిమాపక, వైద్య, పోలీసు అధికారుల సమన్వయంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శోభాయాత్రలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట రూరల్ సీఐ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ తదితరులు ఉన్నారు.

గణపతి విగ్రహాల ఏర్పాటుకు వేదికలు సిద్ధం



హాలియాలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అనుముల, హాలియా మున్సిపాలిటీ పరిధిలో శనివారం జరుపుకునే వినాయక చవితి పర్వదిన సందర్భంగా వివిధ గ్రామాల్లో ఉత్సావ కమిటీ సభ్యులు వినాయక విగ్రహాలను ప్రతిష్టి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇనుపరేకులు, పాలిథీన్ కవర్లు, పందిళ్లు వేసే పనిలో నిగమ్నమయ్యారు. గతంలో పెద్ద గ్రామాల్లోనూ, మండల కేంద్రం లోనూ ఎక్కడో ఒక చోట వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు ఉత్సవాలను జరుపుకునే వారు. కానీ నేడు ప్రతి గ్రామంలోనూ, మారుమూల పల్లేలోనూ పోటీపడి వీధికొకటి చొప్పున విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను పెద్ద పండుగలా జరుపుకోనున్నారు.హాలియా మున్సిపాలిటీ పరిధిలో, అనుముల మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి ఉత్సవాలకు సిద్ధం అయ్యారు. శనివారం వినాకయ చవితి సందర్భంగా ఆయా గ్రామాల్లో విగ్రహాలను ప్రతిష్టిచేందుకు అన్ని ఏర్పాటు పూర్తి అయ్యాయి.

గణేష్ శాశ్వత మండపం ప్రారంభం

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో కుకుడాల చంద్రమౌళి జాపకార్థం ఆయన సోదరుడు కుకుడాల ఆంజనేయులు, రుక్మిణి దంపతులు రూ. 50 వేల వ్యయంతో 3వ వార్డులో నిర్మించిన గణేష్ శాశ్వత మండపాన్ని శుక్రవారం దాతలు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపు కోవాలన్నారు. మున్సిపాలిటీ ప్రజలకు గణపతి నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్, నాయకులు నర్సిరెడ్డి, కొమ్మనబోయిన చంద్రశేఖర్ (లాయర్), గడ్డం రమణయ్య, నామని సుధాకర్, బొంగరాల ఏసురాజు, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు మద్దిమడుగు మార్క్, గుజ్జరి నవీన్, మహేష్, వేమయ్య, నారాయణ తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

దేవరకొండ: బ్రాహ్మణ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని బ్రాహ్మణ సంఘం దేవరకొండ నియోజకవర్గ సమన్వయ కర్త వైద్యుల కృష్ణమూర్తి,నియోజకవర్గ కన్వీనర్ కుర్మేటి వంశీకృష్ణశర్మ,అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్ శర్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోదండ రామాలయంలో జరిగిన నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు మాట్లాడారు. దేవరకొండలో నూతన బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు.నిర్మాణ పనులు వేగంగా జరిగేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సురభి కృష్ణ మూర్తిశర్మ,రవిప్రసాద్‌శర్మ,ఉప్పల శ్రీనివాసశర్మ,గాదె కిషోర్‌శర్మ,కుర్మేటి రవి, సాయి విశ్వనాథ్,చంద్రశేఖరశర్మ,శశికుమార్‌శర్మ,గాదె గిరిధర్‌రావు,ఈటూరి రజనీకాంత్, తదితరులున్నారు.

సమాచారాన్ని నమోదు చేయాలి

గుర్రంపోడు : పాఠశాల వనరులకు సంబంధించి డైస్ ఫామ్‌లో హెచ్‌ఎంలు కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. శుక్రవారం డైస్‌పై హెచ్‌ఎంలకు ఒక రోజు ఓరియంటేష్ శిక్షణా సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో కనగల్ మండల నోడల్ అధికారి వెంకట్రామ్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అజ్మాపురం గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మూడు ఇల్లు కూలాయి. మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు,పిల్లి నిరంజన్,బొడ్డుపల్లి దుర్గయ్యలకు చెందిన ఇల్లు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి నేలమట్టం అయ్యాయి. బాధితులు తహసీల్దార్, ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

చంద్రయ్య సేవలు చిరస్మరణీయం

చింతపల్లి:మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ డైరెక్టర్ అరేకంటి చంద్రయ్య, బీఆర్ఎస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం చింతపల్లి మండలం వింజమూరు గ్రామంలో ఆరెకంటి చంద్రయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూచంద్రయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆయన అన్నారు. చంద్రయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్ రావు,దండేకర్ ప్రసాద్,వింజామురి రవి,జంగయ్య పాల్గొన్నారు.

నాటిన మొక్కను సంరక్షించాలి

పెద్దవూర: వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని చలకుర్తి గ్రామ పంచాయతీలో వనమహోత్సవంలో భాగంగా ఆగస్టు 5వ తేదీ నుంచి 9వ తేదీల మధ్యన నాటిన మొక్కలను ఆడిట్ టీం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంపదవనం, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను లెక్కించి నమోదు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం, శానిటేషన్, జ్వరాల కేసులు, డంపింగ్ యార్డు, గడ్డి కటింగ్ యంత్రాలను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టాలని, నీటి ట్యాంకులను శుభ్రపర్చాలని, మురుగు కాల్వలలో బ్లీచింగ్ ఫౌడర్ చల్లించాలని, ఫాగింగ్ చేయాలని అన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా పరశురాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా పరశురాం, ప్రధాన కార్యదర్శిగా కూన్‌రెడ్డి సైదిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా సుహాసిని ఎన్నికయ్యారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమా

హాలియా : పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీఓ ఉదయ్‌శ్రీ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా శుక్రవారం అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో హాలియా సెక్టార్ పరిధిలోని అనుములవారిగూడెం , అనుముల తండలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో పౌష్టికాహారం లోపాన్ని నివారించేందుకు మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపేందుకు ప్రభుత్వం పోషణమాసాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులు, కిశోర బాలికలు పౌష్టికాహారం లోపం వల్లే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాల ప్రాముఖ్యత, పిల్లల ఎత్తు బరువు పోషణస్థాయి గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ కవిత, భవాని, హెల్పర్ కాశమ్మ, గర్భిణులు, తల్లులు తదితరులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన

మిర్యాలగూడ టౌన్ : పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంట అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బెజ్జం నాగమణి, శ్రీపాద అంజలిదేవి, రహేనా, హెల్పర్లు సైదమ్మ, శిరసన గండ్ల హైమావతి, నాగలక్ష్మి, ఆశా వర్కర్ ధనలక్ష్మి, ఆర్‌పీలు మరియా, సైదా, అమిబి, స్వేత, రేణుక, అనూష, శ్రీలత, యశోధ, మేఘన, సలీమా, సుజాత, అయేషా, స్వాతి తదితరులున్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నర్సింహమూర్తి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, అంగన్‌వాడీ టీచరు శిరీషాలతో పాటు తల్లులు, గర్భిణులు తదితరులున్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వేములపల్లి: ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూపర్‌వైజర్ పరిమి రజిని అన్నారు. మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రం-2లో పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలని ధర్నా



రైతు వేదిక ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

త్రిపురారం : రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరుతూ త్రిపురారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం మండల కేంద్రంలో రైతు వేదిక ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలు చూపుతూ రుణమాఫీ చేయకుండా కొర్రిలు పెట్టడంతో గందరగోళంగా ఉందన్నారు. కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, సుశీల్ నాయక్, షేక్ దస్తగిరి, బిచ్చు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని గాంధీపార్క్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను ప్రధానోపాధ్యాయులు కురువానాయక్ అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెన్రీ, జయంతి, ప్రవీణ్, రాంరెడ్డి, చారీ, ఎలిషా, పీఈటీ కిరణ్‌కుమార్, పార్వతి, సలిమా, నిర్మల, రజిత, వంశీ, సరిత, నాగమణి ఉన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల వైద్యాధికారి అడావత్ నాగేశ్వర్‌రావు, నాయకులు గాలం వెంకన్న యాదవ్, బంటు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు ముందుండాలి

కొండమల్లేపల్లి : దేశ రక్షణ కోసం యువత ముందుండాలని ఆర్మీ మేజర్ రావత్, మేజర్ అభిజిత్‌లు పేర్కొన్నారు. దేశంలో ఆర్మీ సేవలు ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 21 మంది ఆర్మీ జవాన్లతో గత నెల జూలై 30న జమ్మూకాశ్మీర్‌లోని సియాచిన్‌బేస్ క్యాంప్ నుండి అండమాన్ నికోబార్ దీవులలోని ఇందిరాపాయింట్ వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర శుక్రవారం కొండమల్లేపల్లికి చేరుకుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ, శ్రీధర్‌రెడ్డి, సీఐ ధనుంజయ్య, ఎస్ఐ రామ్మూర్తి, కాంగ్రెస్‌మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, కుంబం శ్రీనివాస్‌గౌడ్, దాచేపల్లి నరేందర్, కర్నాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన కోడూరు వెంకన్న కుమార్తె అక్షర నల్లగొండలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కాగా జూలైలో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపింది. దీంతో అక్షరను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈనెల 8న మధ్య ప్రదేశ్‌లోని నిమోచ్ పట్టణంలో నిర్వహించే అండర్ -14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అక్షర తెలంగాణ రాష్ట్ర టీం తరుపున ఆడనుంది.

ఉత్తమ గురువులకు సన్మానం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మండలంలోని ఉపాధ్యాయులను సామాజిక కార్యకర్త పగడాల సైదులు యాదవ్ శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందగర్భంగా సైదులు మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెళ్ల ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనివాస్, కొంగరి సత్యనారాయణ, భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో పని చేస్తున్న తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పార్ట్‌టైం ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాగు నాయక్, సత్యనారాయణ, బ్రహ్మచారి, అనిల్‌రెడ్డి, పుల్లయ్య, మధుసూధన్‌రెడ్డి, జావిద్, నాగేశ్వర్ రావు, లక్ష్మణ్ తదితరులున్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

డిండి: వినాయక చవితి పండుగను పశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు ప్రజలకు సూచించారు. శుక్రవారం కస్తూరి, ఆమనగంటి అలివేలమ్మ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మట్టి గణపతి ప్రతుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో డానియల్,మాజీ ఎంపీటీసీ ఏటి.రాధిక, బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, సముద్రాల రమేష్,మల్లేష్, అంజి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని నార్కెట్‌పల్లి- అద్దంకి బైపాస్ రోడ్డును ఆయన పరిశీలించారు. వై జంక్షన్, నందిపాడు క్రాస్‌రోడ్డు, చిల్లాపురం క్రాస్‌రోడ్, చింతపల్లి క్రాస్ రోడ్డు, ఈదులగూడ జంక్షన్ లను సందర్శించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట టూ టౌన్ సీఐ నాగార్జున, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ తదితరులున్నారు.

ఫారెస్ట్ అధికారులపై దాడి.. కేసు నమోదు

మిర్యాలగూడ: అటవీ భూముల ఆక్రమణలపై అధికారులు గత రెండు రోజులుగా విచారణ చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్, కేజేఆర్ కాలనీలో అటవీ భూములను స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతుండగా బాలాజీనగర్‌తండా గ్రామానికి చెందిన వాంకుడోతు రమేష్ వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బీట్ ఆఫీసర్ ముఖేష్‌కు గాయాలయ్యాయి. అదేవిధంగా రేంజ్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ మల్లారెడ్డి, మరో బీట్ ఆఫీసర్ స్వామి, రవీందర్‌రెడ్డిలపై దాడికి పాల్పడ్డాడు. ఈమేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలి

హాలియా : హాలియా పట్టణంలో బాలికల కాలేజీ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఆ సంఘం ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడారు. హాలియా కేంద్రంలో జూనియర్ కాలేజీ బాలికలకు వసతి గృహం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు, ప్రైవేట్ డిగ్రీ, జూనియర్, ఒకేషన్, ఐటీఐ కళాశాలలు ఉన్నాయని వీటిలో అనేక మంది ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ బాలికలు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కళాశాల బాలికలకు స్థానికంగా వసతి గృహం లేక ఇంటి నుంచి రాకపోకలు నిర్వహించడం ఆర్థిక భారంగా మారిందని వాపోయారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ నరేష్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర రాజు నాయక్, నేనావత్ అశోక్ నాయక్, మంత్రి బాయ్, చిట్టి, హరి నాయక్, శ్రీరాములు నాయక్, ప్రదీప్ ఉన్నారు.

అబ్బురపరిచిన హరివిల్లు



నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి సమీపంలో శుక్రవారం సాయంత్రం ఏర్పడిన ఇంద్ర ధనస్సు